కథానిక

# జన్మ - హక్కు

పోగుల కోటేశ్వరరావు

శాంతిపురం సబ్ జెయిలులో టాణాగంటలు ఖంగున ఎనిమిదిసార్లు మ్రోగినవి. జెయిలు గోడలు ఆ శబ్దాన్ని మ్రింగలేక నానా అవస్థ పడుతూండగా పోలీసు కానిస్టేబులు నంబరు 1945 తాళం చెవులు చేతబుచ్చుకుని జెయిలు వార్డరు వెంబడి నడచి వెళ్ళి 13వ నంబరు గది తలుపు తెరచాడు. లోపల ఒకసన్నని నాజూకు శరీరం పచార్లు చేస్తున్నది. గేటులోనుండి వెలుతురు లోపలికి రావడంతో ఆవ్యక్తి వాకిలి వంకకు తిరిగిచూస్తూ నిలబడ్డాడు. వార్డరు తనను అనుసరించమని ఆ వ్యక్తికి సౌజ్ఞ చేశాడు. రైలు పట్టాలమీద బండి నడచినట్టుగా అడుగులు వేసుకుంటూ జెయిలర్ ఆఫీసు రూములోనికి ఆ వ్యక్తిని ప్రవేశపెట్టారు.

"హల్లో! మిస్టర్ కృష్ణారావు! ఆ కుర్చీలో కూర్చోండి" అంటూ ఆప్యాయంగా పలకరించాడు జెయిలర్.

కృతజ్ఞతతో ఒక్కమారు తలవంచి పైకెత్తి కృష్ణారావు కుర్చీలో చతికిలబడ్డాడు.

జెయిలర్ మళ్ళీ అన్నాడు: "ఈ రోజుతో మీరు విడుదల పొందుతున్నారని తెలియజేసేందుకు చాలా సంతోషిస్తున్నాను. గత ఆరు మాసాలుగా జెయిల్లో మీ ప్రవర్తన చాలా అభినందనీయం" అని ముగించాడు.

కృష్ణారావు మొహంలో కొంచెంగా నవ్వు తొణికిసలాడింది. మూతి వంకరగా పెట్టి కొంటెతనమైనదీ సింగారమైనదీ తెలియకుండా కన్ను కొంచెం ప్రక్కకుత్రిప్పి 'థ్యాంక్స్' అన్నాడు.

జెయిలర్ తిరిగి ప్రారంభించాడు: "మీరు భావిజీవితాన్ని సక్రమమైన మార్గంలో దిద్దుకోగలరని ఆశిస్తున్నాను. జీవితంలో కష్టాల సెదు తొక్కవలసిన అవసరం అందరికీ కలుగుతుంది. అంతమాత్రంచేత అట్టి పరిస్థితుల్లో సాహస ప్రయత్నాలు తలపెట్టడం, గట్టెక్కగలమని ధీమా కలిగివుండటం కేవలం భ్రమ" అన్నాడు చిరునవ్వు ముఖంతో.

కృష్ణారావు ఆఖరుసారి మరొక్క వందనం సమర్పించి బయటకొచ్చాడు.

కృష్ణారావుకు సరిగ్గా పాతిక సంవత్సరాల వయస్సు వుండి వుంటుందనుకోవచ్చు ముఖాన్ని బట్టి అయితే నిజానికి అంతకంటే ఒకటి రెండు సంవత్సరములైనా సరే తక్కువే వుంటాయేమో, గట్టిగా చెప్పలేం. జీవితం మూడు పువ్వులూ, ఆరు కాయలుగా రాణించుకుందని గాలిలో అంతస్థులమీద అంతస్థుల మేడలు నిర్మించుకున్న వాళ్ళలో అతనొక ప్రముఖుడు. కాస్తో కూస్తో కాలానికి తగ్గట్టుగా చదువుకున్నవాడు, సంస్కారం కలవాడు కూడాను.

సుమారు ఇప్పటికి సంవత్సరన్నర క్రితం మద్రాసులో ఒక చిన్న ప్రయివేటు ఫరములో ఆఫీసు గుమాస్తాగా పనిలో ప్రవేశించాడు. బుద్ధి కుదిరి నడుంవంచి చాకిరి చేస్తూనే వుండేవాడు. అయితే తను చేస్తూన్న పనిలో ఏదో తీరని లోపం ఏదో తెలియని కొరత వున్నాయని అతను మానసికంగా ఎల్లప్పుడూ జిజ్ఞాస చెందుతూ వుండేవాడు. తనచుట్టూ ప్రపంచాన్ని గురించి ఇంకా అంతకంటే ఎక్కువగా ఆందోళన చెందుతూండేవాడు, తన పొట్టకోసం తను మరో నాలుగురాళ్ళు సంపాదించుకోవడం చేతగానివాడు ప్రపంచాన్ని ఉద్ధరించెయ్యాలనుకోవడంలోని వెర్రితనం అని పూర్తిగా తెలిసి వున్నప్పటికీ కూడాను.

రోజుకొక రకంగా అతని వేడెక్కిన బుర్రలో ఆలోచనలు రూపొందుతూండేవి. ఆలోచనలకు అర్థం వుండాల్సిన పనిలేదనీ, హద్దూ పద్దూ వుండాల్సిన అగత్యం కూడా లేదని అక్షరాలా రుజువుచేశాడు కృష్ణారావు. ఒకరోజు అనుకునేవాడు: ఈ కంపెనిలో వుద్యోగం మానుకుని ఎదురుగ్గా బిజినెస్ చేస్తున్న ఆ కంపెనీలో చేరితే బాగుంటుందేమో!

మరొకరోజు ప్లాను వేసేవాడు: అమాంతంగా ఏదైనా ఒక చిన్న వ్యాపారం పెట్టేస్తేనో! ఇంకోసారి అనుకునేవాడు: ఏదైనా స్పెక్యులేషన్ లేవదీసి బాగా డబ్బు బాగా గడించ వచ్చునేమో! అని. ఇలా ఏరోజుకారోజు ఆలోచనలతో సతమతమౌతూ కాలచక్రాన్ని దొర్లించాడు.

తను చేసిన ఆలోచనల్లో యే ఒక్కటీ రూపం పొందక పోయినప్పటికీ ఉన్నట్టుండి ఒకనాడు, ఒక మంచి ముహూర్తాన హఠాత్తుగా మహత్తరమైన ప్లాను మెరుపులాగా తట్టింది.

ఆఫీసులో అతను యేజెంట్ల దగ్గర డబ్బు పుచ్చుకుని రసీదు లిస్తూండేవాడు. సాయంకాలానికి ఆడబ్బు లెక్క ప్రకారం కౌంటర్ ఫాయిల్ రసీదులతో సహా మేనేజరుకు వప్పగింత చేసేవాడు. ఆరోజు వుదయం మామూలుగానే ఆఫీసుకొచ్చేడు. చమట తుడుచుకుంటూ కుర్చీలో కూర్చొని "ఇస్సు" అనుకుంటుండగా అనుకోకుండా ఈ గొప్ప ఆలోచన తట్టింది అతనికి.

ఏజెంట్ల దగ్గరనుండి డబ్బు పుచ్చుకుని వరుసగా రసీదు ఇచ్చేశాడు నాలుగువేల అయిదు వందల రూపాయలకు. సాయంకాలం ఆరు గంటలకు మేనేజరు తన గదిలో కూర్చుని కృష్ణారావు రాకకోసం యెదురుచూస్తున్నాడు. గడియారం ముల్లు క్రమక్రమంగా జరిగిపోతున్నది గాని తను యెవరి రాకకోసమైతే యెదురు చూస్తున్నాడో ఆ వ్యక్తి వస్తూన్న జాడమాత్రం కనిపించలేదు. ఉక్కిరిబిక్కిరై పోయి, ఇంక ఓపిక పట్టలేక మేనేజరుగారు బయటికివచ్చి కృష్ణారావు సీటుదగ్గరగా నిలబడి నిర్ఘాంతపోయాడు. కుర్చీ ఖాళీగావున్నది. బల్ల మీద కాగితాలు చెక్కుచెదరకుండా అమర్చబడి వున్నాయిగాని బల్లలోపల నోట్ల కాగితాలు ఒక్కటికూడా బీరుబోకుండా మాయమై పోయినాయ్! వొణుకుతూ, తప్పటడుగులు వేసుకుంటూ మేనేజరు ఫోను చేత బుచ్చుకుని నెంబరు 93 రింగప్ చేశాడు. పట్టణంలోని పోలీసు స్టేషన్లలో టెలిఫోనులన్నీ రింగున మోగినాయిగాని కృష్ణారావు జాడ కనిపించలేదు. నిముషాలమీద మొఫసిల్ స్టేషన్లకన్నింటికీ వర్తమానాలు పంపించేశారుగాని, నెలలు తరబడి గాలించినా కృష్ణారావు ఆచూకీ తెలియనే లేదు.

ఒక సంవత్సరం గడచిపోయింది, కృష్ణారావు బొంబాయిలో ఒక హోటల్ అడ్రసు వివరించి మద్రాసులోని మరొక కంపెనీలో వుద్యోగంకోసం అప్లికేషన్ పంపించాడు. ఆ కంపెనీ ఇతని అప్లికేషన్ చేరేసరికే దివాలా తీయడం, ఆ బిజినెస్ హౌసు వెనుక తను పని చేసిన ఫరమునకు చెందిన ఆస్తిగావటం జరిగింది. ఆ వుత్తరం అదే బిల్డింగులో డెలివరీ చెయ్యబడటంతో గంటలమీద బొంబాయి పోలీసులకు కబురు పంపించి కృష్ణారావుకు బేడీలు తగిలించారు. అంతే. ఆరు మాసాలు శిక్ష అనుభవించి కృష్ణారావు ఇప్పుడు విడుదలపొందాడు.

జెయిలు గేటుదాటి బజారులో అడుగు పెట్టిన క్షణంనుండి కృష్ణారావు యెడతెరిపి లేకుండా బుర్రను పనిచేయించాడు. భావి జీవితంలో తానూ ఒక సౌశీల్యంగల పౌరునిగా సంచరించాలని ఆశించాడు. తాను ఇంతకు పూర్వం జీవితాన్ని గురించి కనిన కలల నన్నింటినీ ఇప్పటికప్పుడే మరచిపోవడం కూడా జరిగింది. అయితే మరి నలుగురితో బాటు నారాయణ అన్నట్టుగా తనుగూడా పొట్టకోసం నాలుగు రాళ్లు సంపాదించుకోవాలిగదా, పెళ్లి పెటాకుల ప్రసక్తి ప్రస్తుతం లేకపోయినా? అదే పెద్ద సమస్య. ఇప్పట్లో సమాధానం దొరకని పెద్ద క్వొశ్చన్ మార్కు!

ఇలాగ ఆలోచించుతూ మెయిన్ రోడ్డు మీద నడుస్తున్నాడు, వంచిన తల పైకెత్తకుండా. "ఫుంయ్! ఫుంయ్!"మని శబ్దం తన చెవుల దగ్గర కొచ్చింతర్వాతగాని కళ్లు పైకెత్తి చూళ్ళేదు. సరిగా అతని కాళ్ళనుండి రెండున్నర అడుగుల దూరంలో కారు ఆగివున్నది.

"నమస్తే! కృష్ణారావుగారు!" అంటూ ఎంతో ఆదరంగా పలకరించాడు కారులో చతికిలబడి వున్న పెద్దమనిషి. కృష్ణారావు మొఖం వెలవెలాబోయి కన్నార్పకుండా చూచాడు. ఎవరు? తను వెనక బొంబాయిలో మకాం వేసినప్పుడు, ఆ హోటల్లో ప్రక్కగదిలో దిగిన

వ్యాపారస్థుడు ఇతడేనని పోల్చుకో గలిగాడు. కారు రెక్కతీసి పరిచయంగానే లోపలికి జొరబడ్డాడు.

"మీరు ప్రస్తుతం ఏం చేస్తున్నారు" అని పలకరించాడు ఆ పెద్ద మనిషి, స్నేహితునికి చోటిచ్చేందుకు బాగా ప్రక్కకు వొత్తుకుని. కృష్ణారావు ఒక్కసారి పెదిమలను తడిచేసుకుని సంశయం లేకుండా, మహా బిరుతుగా సమాధానం చెప్పాడు: "బ్రోకరేజి" అని ఓ చిరునవ్వు పారేశాడు. ఆ పెద్దమనిషి కూడా నిజంగా హర్షించినట్టుగా మందహాసం చేశాడు.

ఆ పెద్దమనిషి కృష్ణారావును తన బంగళాకు తీసుకుపోయి చాలాసేపు సంభాషించాడు. ఆ రోజుకు తన ఆతిథ్యం స్వీకరించమని ఆహ్వానించాడు. వ్యాపార విషయాలను గురించి వారిద్దరూ భోజనాలయింతర్వాత ప్రొద్దుపోయే వరకూ చర్చ విచర్చలు జరిపి కునికిపాట్లతో అంతం మొందించారు.

చిట్టచివరకు తేలిన సారాంశమేమంటే కృష్ణారావు ఆయనకు కమీషన్ ఏజంటుగా ఏర్పాటయినాడు. ఆ పెద్దమనిషికి ఏదో ఒక అడ్రెసు తెలియజేసి కృష్ణారావు మళ్ళా ఢక్కా వచ్చాడు. అనుకోకుండా ఓ పెద్ద ఉద్యోగం కంటే మించి సంపాదించేందుకు అవకాశం లభించినందుకు కృష్ణారావు తనకు తానే ధన్యవాదాలర్పించుకున్నాడు. ఆ సమయంలో ఆ పెద్దమనిషియెదుట జంకుగొంకులు లేకుండా, కలవరపడకుండా బొంకినందుకు తన ధైర్యాన్ని తనకు తానే మెచ్చుకున్నాడు. ఇకముందు వ్యాపారం కొనసాగించడమెలాగా? అని ఆలోచించసాగాడు.

ఆ పెద్దమనిషికి తన అడ్రసు తెలియజేసినప్పుడే మొట్టమొదటిసారిగా కృష్ణారావు బేరం కుదుర్చుకున్నాడు. ఆయనగారు సీమ నుంచి దిగుమతి చేయనున్న ఫ్యాన్సీ సామాన్లను తాను రిటైల్ డీలర్లకు అందజేస్తానని.

కృష్ణారావు ఆయన్ను కలుసుకోవాలని అనుకుంటూండగానే ఒకనాడు కాకతాళీయంగా కనుపించడం తటస్థించింది. సీమనుంచి సరుకు స్టీమర్లో వచ్చి రేవులో పడివున్నదనీ, వెంటనే బేరములు కుదుర్చుకుంటే డిమరేజి ఛార్జీలు తగులకుండా మంచి లాభాలు మిగులుతాయని పూసగ్రుచ్చినట్లు నచ్చచెప్పాడు. కృష్ణారావు అంగీకరించాడు. సరుకు తన పూర్తి బాధ్యత మీద అమ్మకంచేస్తాననీ, సరుకు తెచ్చినందుకు పెట్టుబడి ఖర్చులు వగైరాలు గాక కొంతలాభం తీసుకోమని ఆయనతో బేరం కుదుర్చుకున్నాడు. నుంచున్న పళంగా మంచిమంచి మాటలు చెప్పి సరుకు డెలివరీ పుచ్చుకున్న వెంటనే సొమ్ముకు చెక్కు రాసిస్తానని వాగ్దానంచేసి ఆ పెద్దమనిషి దగ్గర సెలవుదీసుకుని వెళ్ళాడు ఆ రోజుకు.

రెండుమూడు రోజులు గడిచేలోగా కృష్ణారావు కొంతమంది రిటెయిల్ డీలర్లను సంతిన చేసుకోగలిగాడు. ఆ వెంటనే ఆ పెద్దమనిషి దగ్గరకు వెళ్ళి సరసు బట్వాడా చెయ్యవలసిందనీ, చెక్కు ఇప్పుడే వ్రాసిస్తాననీ కోరాడు. వెంటనే జేబులోనుంచి చెక్కు పుస్తకం తీసి రూపాయి అణాలు పైసలు బీరుబోకుండా చెక్కు ముద్రగొట్టినట్టుగా ముచ్చటగా వ్రాసి ఇవ్వడమూ జరిగింది. అది ఆరోజు సాయంకాలం నాలుగున్నర గంటలకు జరిగిన సంఘటన.

మర్నాడు తెల్లవారి పదకొండు గంటలయేసరికి కృష్ణారావు పడవలోంచి సరుకు దింపించడం, వేర్వేరు షాపులకు రకరకాల సామాన్లను చేరవేయడం మొదలయిన పనులన్నీ శుభ్రంగా పూర్తి చేసుకున్నాడు. పదకొండు గంటలకు అతను వ్యాపారం చేసే ఇంట్లో కూర్చొనివుండగా టెలిఫోను మ్రోగింది. ఆ పెద్దమనిషి మాట్లాడుతున్నాడు. నిన్న సాయంకాలం నాలుగు గంటలకు బ్యాంకి మూసివేయబడ్డదనిన్నీ అంచేత ఈపూట వెళ్ళి చెక్కు క్యాష్ చేసుకోబోతున్నానని ఎందుకో అనవసరంగా తెలియజేశాడు ఆ పెద్దమనిషి. "సరే" అని ఒక్కమాటలో ముక్తసరిగా, వ్యాపారసుడివలె సమాధానం చెప్పి టెలిఫోను క్రింద పెట్టేశాడు కృష్ణారావు. అంతే. ఆ క్రింద బెట్టిన టెలిఫోను అలాగే వుండిపోయింది. తరువాత కొంతసేపటికి ఆ టెలిఫోను రింగు రింగుమని ఎడతెరిపి లేకుండా, కొంపలు తగలబడ్డప్పుడు ఫైరు ఇంజను మోస్తరుగా మ్రోగింది. ఎవరూ వచ్చి టెలిఫోను ముట్టుకునే పాపాన బోయేట్టుగా సూచనలేమీ కనుపించలేదు. నురుగులం

ప్రక్కనుంటూ ఆ పెద్దమనిషి ఆయన వెంట పోలీసువాళ్ళు వచ్చేంత వరకూ ఆ విశాల భవనంలో మనుష్య సంచారం లేనే లేదు. పోలీసువాళ్ళ కాళ్ళన ఇనుపబూట్ల చప్పుడుతో ఆ మేడ దద్దరిల్లిపోయిందిగాని కృష్ణారావుజాడ తెలియనే లేదు. ఇంటి యజమానికి కబురంపగా వచ్చి మూడునాళ్ళ ముచ్చటకు విస్తుబోవటంతో ఈ అంకంలోని ముఖ్యమైన రంగం ముగిసింది.

ఆలాగ ఎన్నాళ్ళు గడిచిందో ఎవరూ ఊహించలేరు. అయితే కృష్ణారావు మాత్రం బొంబాయిలో ఒక ఫ్యాషనబుల్ ప్రాంతంలో చక్కని బంగళాలో కూర్చుని క్షణం ఒక్కొక యుగంగా ఒకటికి రెండుసార్లు లెక్కించుతూ కాలం గడుపుతున్నాడు. మెడకాయ మీద తలకాయ వున్న ప్రతివాడి నీడ సహితం అతనికి సింహ స్వప్నంగా గోచరించుతుండేది. తన ఇంటి కటకటాలు చూచినప్పుడల్లా అతనికి సెంట్రల్ జెయిల్ స్మరణ కొస్తూండేది. తన నౌకరు పాతబూట్లు తొడుక్కుని గట్టిగా అడుగులు వేస్తూ నడచినప్పుడల్లా అతను అదిరిపడి ఆ వైపుకు చూస్తూండేవాడు. గోడమీద గడియారం గంటలమోత అతనికి తాణా గంటల మోస్తరుగా చెవుల్లో గింగురున తిరుగుతూండేవి. తనచేతినిండా డబ్బువుంటే తాను ఈలోకాన్ని ఆచివరనుంచి ఈచివరకునిలువుగా నిప్పులేకుండా తగలబెట్టగలననే ధీమాతో నిన్న మొన్నటి వరకూ ఉన్న కృష్ణారావు ఇప్పుడు ఇంత డబ్బు నెత్తినపడ్డ తర్వాత తన ఇంట్లో నాలుగ్గోడల మధ్యా కూర్చునేందుకే భయపడుతున్నాడంటే అంతకంటే వేరుగా నరకలోకాన్ని యే దేవుడు సృష్టించగలడు?

తాను ఆశించిన జీవితానికీ తాను నిజంగా గడిపిన జీవితానికి శతసహస్రం వ్యత్యాసం కనుపించింది కృష్ణారావుకు. తన నిర్ణయాలు, నిశ్చయాలు అన్నీ ఎప్పటికప్పుడు నీరుగారిపోయినా ఆ హృదయం ఎంతగా క్షోభించిందో! మానసికంగా అతనిలో తీవ్రమైన సంఘర్షణ నిరంతరం సాగుతూ ఒక్కొక్క రోజు పైన బడ్డకొద్దీ మరింత ఉధృతం అయింది. అలాంటి పరిస్థితుల్లో మానవుడు ఏదో ఒక అఘాయిత్యాన్ని తలపెట్టడం అతిసహజం.

ఒకరోజు సాయంకాలం కృష్ణారావు సముద్రపుటొడ్డుకు షికారుకు బయల్దేరినట్టుగా వచ్చాడు. సూర్యకాంతి క్షీణించి పోయేంత వరకూ, చుట్టుపక్కల మనుషుల చడీ సందడీ మాటుమణిగేంత వరకూ అక్కడనే వేచివున్నాడు. అంతవరకూ గూడా అతని హృదయంలోని ఘోష ఆ సముద్రంలోంచి తాటిప్రమాణాన పైకెగసిన అలల పరంపరకు మిన్నగా అతన్ని మర్దించివేసింది. గంభీరంగా ఒక్కొక్క అడుగే ముందుకు వేసి ఆ అనంత సముద్రంలో తను శాశ్వతంగా విశ్రాంతి పొందవచ్చునని ఆశించుతూ ముందుకు సాగిపోతున్నాడు. ఆ సముద్రమధ్యం నుండి యెవరో తనను ఆహ్వానిస్తున్నట్టుగా అతను ముందుకు చూశాడు. పుక్కిలింతలయేవరకూ అడుగులు వేశాడు. అలా రెండు నిముషాలు గడిచేలోగా వెనుకనుండి విజల్సు మోతలు అతన్ని గాబరా పెట్టసాగాయి. శరీరమంతా పాములు జెర్రులు ప్రాకినట్టుగా అతను చిరాకుపడుతూ మరింత త్వరిత గమనంలో ముందుకు ఉరికాడు. అయితే మాత్రం ఈ కార్యక్రమంలో గూడా అతనికి ఆశాభంగం జరిగింది. ఇద్దరు పోలీసులు వచ్చి చెరొక రెక్క బుచ్చుకున్నారు. కృష్ణారావు ఎక్కడలేని ధైర్యాన్ని తెచ్చుకుని పోలిసువాళ్లను ప్రతిఘటించేందుకు ఉద్యుక్తుడయ్యాడు.

"నా జీవితంపైన నాకు పూర్తిగా హక్కులున్నాయి. రాణించేందుకుగాని క్షీణించేందుకుగాని ముఖ్యమైన కర్తను నేనేగదా! నా జన్మహక్కును తోసిరాజనేందుకు మీరెవరు? వదలండి!" అని బిగ్గరగా అరుస్తూ గుంజుకున్నాడు. కాని ప్రయోజనంలేదు.

* * *

శాంతిపురం స్పెషల్ సబ్ జెయిలు. కొద్దిరోజులక్రిందట వెలుపలకు వచ్చిన మనిషి ఇప్పుడు లోపలికిపోతున్నాడు. తాణా గంటలు రాత్రి ఎనిమిది మ్రోగించాయి. పోలీసు కాన్‌స్టేబుల్ నంబరు 1950 తలుపు తాళం బిగించాడు. లోపల ఆ సన్నని శరీరం సొమ్మసిల్లి పడివున్నది.